# దేశభక్తులు

[కథానిక]

— శ్రీ సీతారాం —

“మధూ!”

ఎంత మధుర మాపిలుపు! ఆగొంతులో ఎన్ని కోయిలల గానమాధుర్యం యిమిడివుంది! ఒక వారం రోజులు ఆగొంతు వినబడకపోతే తన కెలా వుంది! ఎన్నాళ్లల్లో ఎంత స్నేహం! ఒకరిమీద ఒకరి కెంత గాఢానురాగం! భగవచ్చిత్రం. తా నెక్కడ పుట్టాడు, ఆమె ఎక్కడ పుట్టింది? ఈ కలయిక ఏమిటి?—ఇలా మనసులో ఏమిటేమిటో అనుకుంటూ మధూ టాంగాలోనుంచి దిగాడు.

మధూ టాంగాలో వస్తూవుండడం దూరానుంచే మేడమీదనుండి గమనించి శాంత గబగబా మెట్లమీదనుంచి నేలను ముద్దులాడే చీరకుచ్చెళ్లను ఎడమచేత్తో పైకిపట్టుకుని తొందరలో పడిపోకుండా వుండేట్టుగా పూతగా కుడిచేతిని గాలిలో ఆడిస్తూ పరుగెత్తుకొచ్చింది గుమ్మందగ్గిరికి.

ఆమెను చూచీ చూడడంతోనే మధూకి పట్టరాని సంతోషం వచ్చింది. అతని చేతుల్లో పత్రిక దానంతటదే జారిపోయింది.

“శాంతా!”—ఆమెకెదురు పరుగెత్తి, ఆమె ఆనందంకొద్దీ పైకెత్తిన చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని ఉద్రేకంకొద్దీ గట్టిగా నొక్కిపట్టుకున్నాడు. ఆకరస్పర్శ వల్ల కలిగిన ఆనందంతో వారి మొహాలు జేవురించాయి. ఒకరినొకరు చూచుకుని తన్మయులై ప్రేమప్రవాహంలో యీదడం మొదలెట్టారు. వీళ్లిద్దరూ ఇలా నిలబడిపోవడం ఇంట్లోనుంచి శాంతతల్లి వచ్చిచూచి గుమ్మంలోపలే నిలబడిపోయింది. వెనకాల టాంగావాడు పెట్టే పరుపూ పట్టుకొచ్చి “ఎక్కడపెట్టాలి బాబూ” అనేవరకూ వారీప్రపంచంలో లేరు. ఉలిక్కిపడి మధూ శాంత చేతులు విడిచాడు. వెనక పెట్టే, పరుపూ పట్టుకునుంచున్న టాంగావాణ్ణి చూచి సిగ్గుపడి తనగదివైపు నడిచాడు. శాంత అతని వెనకే నడిచింది. టాంగావాడు పెట్టే, పరుపూ గదిలో పెట్టేసి డబ్బులు తీసుకు వెళ్లిపోయాడు. శాంత ఆప్యాయంతో అతను విడిచే గుడ్డల్ని అతను వారించినా వినకుండా అందుకుంటూ బొంబాయికభుర్లు చెప్పమంది.

మధుసూదనుది బెజవాడదగ్గర ఓపల్లెటూరు. కాని ఆఊరెప్పుడూ అతడు చూచే ఎరగడు. అతనికి జ్ఞానం వచ్చినప్పట్నుంచీ పట్టణాలలోనే వుండేవారతని తలిదండ్రులు. తండ్రి పోలీసుసర్కిల్ ఇన్స్పెక్టరు. అతనికి ప్రభుత్వంలో మంచి పేరుంది. మధూకి ఒక తమ్ముడూ, చెల్లెలూ. ఆఇంట్లో అందరూ రూపసులే. మధూ చిన్నప్పట్నుంచీ పెంకిగా వుంటూవుండేవాడు. ఎప్పుడూ ఇంటికి వేళకు రాకపోవడం, ఎక్కడన్నా ఏదన్నా సభలు, సమావేశాలు ఉన్నాయంటే చెప్పకుండా వుడాయించెయ్యడం అతనికి బాగా అలవాటయిపోయింది. తండ్రి అతన్ని ఎన్నిసార్లో వారించాడు. తిట్టాడు, కొట్టాడు. మధూ వింటేనా? మధూ కాలేజీలో చేరింది మొదలు మరీ ముదిరింది వ్యవహారం. జిల్లాలో తను హాజరుకాని జాతీయవుత్సవమే లేదు. చిన్నతనంలో తను సరదాకి తిరిగినా రానురాను తను చేస్తున్న పని ఉత్తమమయినదని గ్రహించాడు. కమ్మటి గాత్రం అతనిది. ఊరేగింపుల్లో చక్కటి జాతీయ గీతాలు పాడి ప్రజల శరీరాలు పులకరింపజేసేవాడు.

అతనికి తన దేశదారిద్ర్యం అతికంటకంగా కన్పించింది. ఎక్కడచూచినా బిచ్చగాళ్లు, రోగులు, తిండి

లేక ఎండిన పశువులూ, పాలులేక సొమ్మసిల్లే పిల్లలూ—ఇవన్నీ అతని మనస్సు కలచివేశాయి. దీనికి కారణాలు రాజకీయపెద్దల్ని అడిగీ, పుస్తకాలు చదివీ గ్రహించాడు. దాస్యం! దీన్ని బాపడం ఎలా? నలభై కోట్లమంది జనం బానిసలై పశువులకంటే హీనంగా చూడబడుతున్నారే! పంటలతో తులతూగే ఈ దేశంలో కట్ట గుడ్డలేక, తిన తిండిలేక వందలకివందలు మాడి చస్తున్నారంటే దీని కంతకూ కారణం పరపీడనమేగదా!

అతనికి తిండి సహించేది కాదు. రాత్రుల్లో నిద్రపట్టేదికాదు. ప్రజల్లో చైతన్యాన్ని కలిగిస్తేనే కాని, ప్రజలంతా ఏకమయి ప్రభుత్వాన్ని ఇల్లువిడవమని చెప్పేస్థితికి వచ్చేవరకూ ఏమీ ప్రయోజనం లేదని గ్రహించాడు.

కాలేజీలో విద్యార్థిసంఘాన్నొకదాన్ని లేవదీశాడు. అతడి రూపం, గాత్రం చాలామందిని ఆకర్షించాయి. ఇతరవిద్యార్థులతో కలిసి వాడవాడల్లో, పల్లెపల్లెల్లో ప్రబోధంచేయడం ఆరంభించాడు. పెద్దపెద్ద దేశనాయకుల్ని పిలిపించి జాతీయవుత్సవాలు ఏర్పాటు చేసేవాడు. యువజనసేవాదళ మొకటి ఏర్పాటుచేశాడు.

మధూతండ్రి కిదేమీ గిట్టలా. ఈవిధంగా తన కొడుకు ప్రవర్తిస్తే ప్రభుత్వం తన కేం చేస్తుందో? తన కొడుకు చేసేది మంచిపనో, చెడ్డపనో అది వేరేమాట. విచ్చలవిడిగా మధూని విడిచేస్తే తన కూట్లో మన్నడి పోదూ? కొట్టే వయస్సు దాటిపోయిందిగనక మధూకి బ్రతిమాలి చెప్పాడు. ఆవిషయంలో తన నడ్డుపెట్టొద్దనీ, తను చేస్తున్న పని ఉత్తమమయినదనీ తండ్రికి చెప్పాడు మధూ. ఇలాగయితే లాభంలేదని తండ్రి అతన్ని కాలేజీలోనుంచి మాన్పిస్తానని బెదిరించాడు. చదువులేకుండా చెడిపోతావని భయపెట్టిచూచాడు. తండ్రి ఆవిధంగా అన్న మర్నాడే తనే కాలేజీకి వెళ్లడం మానాడు మధూ.

కాలేజీకి వెళ్లకపోవడం మూలాన అతనికి రాజకీయవ్యవహారాల్లో పాల్గొనేందుకు బాగా వ్యవధి చిక్కింది. స్తుతిమించి రాగాన పడిం దనుకున్నాడు వ్యవహారం తండ్రి. మధూకి ఎన్నిసార్లో చెప్పాడు "వద్దురా బాబూ ఆపని" అని. చివరకి యథార్థ విషయంకూడా చెప్పాడు: ఈవిధంగా తను ప్రవర్తిస్తే తమ సంసారం ఏంకానని.

మధూ తన తండ్రిస్థితి గ్రహించలేని అజ్ఞాని కాడు. వెంటనే ఇల్లు విడిచిపెట్టాడు. తల్లి గోల పెట్టింది. తమ్ముడూ, చెల్లెలూ బ్రతిమాలారు. ఊహు—వినలా. తనను చూడాలని వుంటే తనెక్కడ వుంటే అక్కడకు వచ్చి చూచి వెళ్లమన్నాడు. ఆఇంటికి మాత్రం తను రాలేనన్నాడు.

ఇప్పుడు తన జీవనోపాధి ఎలా? అక్కడక్కడా ఏవో ప్రయివేట్లు కుదుర్చుకుని ఏదో కడుపున వేసుకుని రాజకీయకలాపాల్లో మిగిలిన కాలం వెళ్లబుచ్చేవాడు. అప్పుడప్పుడు తల్లి డబ్బుపంపేది. తిప్పిపంపేసేవాడు.

పూనాలో అఖిలభారత విద్యార్థిసమావేశ మొకటి జరిగింది. దానికి ఇంకా కొందరితోపాటు మధూ ప్రయాణమయ్యాడు. సమావేశం చాలా బాగా జరిగింది. పూనాలో అతనికి చాలామంది స్నేహితులయ్యారు. పూనారాష్ట్ర విద్యార్థిసభ అధ్యక్షుడు దేశ్‌ముఖ్, ఉపాధ్యక్షురాలు శాంత అతన్ని బాగా గౌరవించారు. అతని సంగతి మిగిలిన ఆంధ్రరాష్ట్ర విద్యార్థిసభ ప్రతినిధులద్వారా విని అతని త్యాగానికి చాలా అభినందించారు. కొద్దికాలం తమతోపాటు వుండి తమ రాష్ట్రంలో పర్యటనంచేయమని కోరారు. మధూ సంతోషంతో దానికి అంగీకరించాడు.

మహారాష్ట్రపర్యటనంలో అతను శాంతహృదయంలోకి చొచ్చుకుపోయాడు. ఒకరిమీద ఒకరికి ప్రేమ అంకురించింది. ప్రేమకు హద్దు వుందా? ఊళ్లు దాటుతుంది, జిల్లాలు దాటుతుంది, రాష్ట్రాలు దాటుతుంది—దేశాలే దాటిపోతుంది! ఇద్దరికీ పరస్పర ప్రేమ కలిగినా ఒకరికొక రాసంగతి చెప్పుకునేందుకు జంకారు.

శాంత తలిదండ్రుల కొక్కతే బిడ్డ. వారు మంచి ఆస్తిపరులు. ఆమె బి. ఏ. పరీక్షకు చదువుతోంది.

మహారాష్ట్రపర్యటనం అయినతర్వాత, తను వెళ్లిపోతానని మధూ శాంతతో చెప్పాడు. శాంత

ఒప్పుకోలా. కొంత కాలం తమతో వుండమని కోరింది. కొన్నాళ్లు సహవాసంచేసిన చనువుతో అసలు మహా రాష్ట్రంలోనే అతనెందు కుండిపోకూడదని కూడా అడిగింది. ఏం? తన రాష్ట్రానికి వెళ్లిపోయినా తన తండ్రితో నివసించి అతనికి కష్టంకలిగించడం తన కిష్టంలేదుగా?

మధూ మౌనం దాల్చాడు.

అతడు మౌనంగా వుండటం మూలాన మరింత ధైర్యం కలిగి, అతడు వేరువిధంగా భావించకపోతే తమ ఇంట్లోనే వుండిపోవచ్చునని కోరింది. తన తలి దండ్రులకు మగపిల్ల లెవ్వరూ లేరు. అతను వుండి పోవడానికి అంగీకరిస్తే తన తలిదండ్రులు అపరిమితం గా సంతోషిస్తా రంది. తా మిరువురూ కలిసి ద్విగుణీకృతోత్సాహంతో దేశసేవ చెయ్యొచ్చునంది. ఉండిపొమ్మని మరీ మరీ బ్రతిమలాడింది. తలఎత్తి ఆమె వంక చూచి, కాదనలేకపోయాడు.

శాంత తలిదండ్రులు అతను వుండడానికి అంగీ కరించినందుకు చాలా ఆనందించారు. ఆఇల్లు తన ఇల్లు గానే భావించుకొమ్మని చెప్పారు. తమ బిడ్డవలే చూచుకుంటాం, తమవద్దే వుండిపొమ్మన్నారు.

శాంతకూ, మధూకూ ఒకరిమీద ఒకరికి గౌర వాభిమానాలు పెరిగిపోయాయి. ఒకరిమీద ఒకరికి ప్రేమ దాచుకోవాలన్నా దాచుకోలేక పోయేవారు. శాంత ఏదన్నా పాట మొదలెట్టితే మధూ అందుకుని, మళ్లీ సిగ్గుపడి మానేసేవాడు. శాంత పాడమని బ్రతి మాలేది. ఇద్దరూ కలిసి చక్కగా పాడేవాళ్లు. మధూ మహారాష్ట్రభాషాభ్యసనానికి శాంత గురువు. అతడు ఎక్కడన్నా తప్పు చదివితే మళ్లీ చదవమనేది. మళ్లీ చదవమన్నప్పుడు తప్పు తెలుసుకున్నా కావాలని తప్పుచదివేవాడు. మళ్లీ మళ్లీ చదవమన్నా తప్పు చదివేవాడు. శాంత అతన్ని గట్టిగా కేకలేసేది. ఇలాగయితే ఇక చదువురాదు పొమ్మనేది. మొహం చిట్లించుకుని, ఇంత మొద్దబ్బాయికి చదువు చెప్పలే ననేది. "ఆ, ఆ, కోపంవద్దు" అని సరిగా చదివేవాడు. ఇద్దరూ విరగబడేటట్లు నవ్వుకునే వారు.

ఇలా రోజులు చకచకా పరుగెత్తాయి. బొం బాయిలో రాష్ట్రవిద్యార్థి సమావేశం దగ్గిరకొచ్చింది. దానికి మధూ ప్రయాణమయ్యాడు. శాంతకి పరీక్షలు దగ్గిరవడంమూలాన బయలుదేరలేక పోయింది.

౨

శాంతకు పరీక్షలయిపోయినాయి. మధూ బొం బాయినుంచి తిరిగివచ్చాడు. బొంబాయిలో సంగతు లన్నీ విన్నది శాంత.

ఇద్దరూ వుత్సాహంతో వూరూరా ప్రచారం ఆరంభించారు. వారిద్దర్నీ చూచి జనం ముచ్చటపడే వారు. లేతవయస్కులు. అందగాళ్లు. విద్యావంతులు. మంచి వాగ్ధోరణి వుంది. ఇద్దరివీ చక్కటి గొంతులు. కమ్మటి జాతీయగీతాలు ఒళ్లు పులకరించేట్లుపాడేవారు. ప్రజలు వారి ఉపన్యాసాలు విని ఉద్రేకంపొందేవారు.

ఒకరోజు రాత్రి వారు తిరిగితిరిగి వచ్చి ఒక వూళ్లో ఒక సత్రంలో మకాం వేశారు. శాంత పూర్తిగా బడలిపోయింది. పల్లెటూళ్లలో తిరగడమంటే మాటా! మట్టిరోడ్లమీద, చేలగట్లంట, తుప్పల్లో, నీళ్ల మడు గుల్లో, మోకాటిలోతు రొంపిలో నడిచిపోవాలి. శాంత పూర్తిగా అలసిపోయివుంది. దానికితోడు ఆకలిలేదని తిండిమానేసింది. దానితో నీరసించి స్పృహతప్పింది. అప్పటికి బాగా చీకటిపడింది. తామున్న గదిలో ఓ మూల కూజాలో కాసిని నీళ్లున్నాయి. అవి తెచ్చి ముఖాన కొట్టాడు మధూ. ఆమెశిరస్సుదగ్గర కూచుని ఉపచారాలు చేశాడు. ఆమెనుదురు తన వేళ్లతో మెల్లగా నిమిరాడు. ఆమెతల తీసి తనతొడమీద పెట్టుకున్నాడు. ఆమె ఆమాదిరిగా నీరసపడడం, తా నామెకు శుశ్రూష చెయ్యడం తటస్థించినందుకు, ఆమె కష్టపడడం ఇష్టంలేకపోయినా, సంతోషించాడు.

శాంత బలహీనంగా వున్నా ఎంత ముద్దుగా వుంది! స్త్రీ సహజంగా, శారీరకంగా పురుషునికంటే బలహీనగనక, మృదుశరీర గనక మగవాడు సాధారణం గా స్త్రీని తన రక్షణలోకి తీసుకోడానికి గర్విస్తాడు. శరీరాన్ని మరచిన స్థితిలో కొంతసే పుండి శాంత మెల్లగా

తెప్పిరిల్లి తన చెయ్యి నుదుటిమీద వేసుకుంది. ఆమె నుదురు సవరిస్తున్న మధు చెయ్యి తగిలిం దామెచేతికి. అప్పుడు తన తల మధూ తొడమీద వుందని గ్రహించి సిగ్గుపడి లేచి కూర్చోబోయింది. మధూ వారించాడు. అతని చేతిని తన చేత్తో నొక్కిపట్టుకుని ఆనంద బాష్పాలు విడిచింది శాంత.

వెన్నెలరాత్రి...చల్లటిగాలి వీస్తోంది...మిణుగురుపురుగులు చంద్రుణ్ణి చూచి సిగ్గుపడి తుప్పల్లో దాక్కొనేందుకు ప్రయత్నిస్తున్నాయి.

శాంతా, మధూ ఇద్దరూ కలిసి ఒకపాట పాడారు. మధూ ఒక ఎత్తు అరుగుమీద కూర్చున్నాడు, ఇంటిచుట్టూ వున్న తోటలో ఒక మూల. శాంత దగ్గరకు వచ్చి అతని భుజంమీద చెయ్యి వేసి సిగ్గుతో తలవంచుకుంది. ఆమెచెయ్యి తీసి తన చేతుల్లో పెట్టుకుని "ఏమి, చెప్పమ" న్నట్లు ఆమెవైపు చూచాడు మధూ.

శాంతబుగ్గల్లోకి రక్తం పరుగెత్తుకొచ్చింది. నును సిగ్గుతో అతనిని వివాహమాడాలని తన కోరిక అని చెప్పింది. మధూ తన చేతితోవున్న ఆమెచేతిని గట్టిగా నొక్కి తన సంతోషాన్ని తెలిపాడు. కాని వెంటనే తన స్థితి జ్ఞాపకానికొచ్చి ఆమెచెయ్యి జారవిడిచాడు. ఆమె నిర్ఘాంతపోయింది.

"మధూ!-నన్ను వివాహమాడడం నీ కిష్టంలేదా" అని తత్తరపాటుతో అడిగింది.

మధూ ఆలోచనలో పడిపోయి వెంటనే జవాబు చెప్పలేకపోయాడు.

"మధూ!" అతని భుజాలు పట్టుకు కదిలించింది.

"శాంతా! నిన్ను నేను నిజంగా ప్రేమిస్తున్నాను. నీబోటి సుగుణవతిప్రేమ సంపాదించడం నా అదృష్టం. కాని నాస్థితి నీకు తెలుసు. నేను ఇల్లూ వాకిలీ లేనివాడిని. నాచేత ఒక రాగిదమ్మిడీ అయినా లేదు. ప్రజల దారిద్ర్యనివారణకోసం, దాస్య విముక్తికోసం యుద్ధంచేసి జయం సంపాదిద్దామని ఇల్లూ వాకిలీ విడిచి, తల్లినీ తండ్రినీ ఎడబాసి నేను ఒకవిధంగా దరిద్రుణ్ణయ్యాను. ప్రజల ఆదరాభిమానాలే నా భాగ్యమయినప్పటికీ నీబోటి సుగుణతో సన్నిహిత బాంధవ్యం ఏర్పరచుకోవడం కూడా ఓ పెద్ద అండను కల్పించుకోవడమే. అయినా నాస్థితినిబట్టి నీకు నేను తగినవాణ్ణి కానని తోస్తూవుంది. ఈవివేకం నాకు ఇంతకుముందు కలగకపోయినందుకు చింతిస్తున్నాను. ఇన్నాళ్లూ ఒళ్లుమరచి చనువుతీసుకుని నీహృదయాన్ని అపహరించాను. క్షమించు. నేను చేసింది ఘోర తప్పిదమే. నన్ను తప్పక క్షమిస్తావనుకుంటాను—శాంతా!—అలా చూస్తున్నావేం? సరిగ్గా చూడు—క్షమించవూ? పోనీ దూషించు. నేను దూషణకే పాత్రుణ్ణి. నిన్ను చూచి ప్రపంచమే మరచిపోయాను. నన్ను నేను పోషించుకోలేని స్థితిలో వుండి నీవంటి వుత్తమురాలిని, శ్రీమంతురాలిని ప్రేమించాను. నీ సుగుణాలన్నీ నాకు తెలుసు. సర్వసుఖాలూ నీ ఆస్తివల్ల పొందగలిగివుండీ కూడా దేశంకోసం త్యాగం చెయ్యడానికి నీవు సిద్ధంగా వున్నావని నాకు తెలుసు. నీవు వివాహమాడవలసివస్తే మాత్రం సామాన్యధర్మప్రకారం నీహోదాలోవున్న పురుషుని నీవు వివాహమాడాలి. లేకపోతే అది ప్రపంచానికి బాగా కన్పించదు. నేను నిన్ను వివాహమాడితే నాకు నామీదే ఒకవిధమైన హైన్యభావం అంకురిస్తుందని తోస్తోంది. అన్ని విషయాల్లో నీవు నాకంటే మిన్నవు. విద్యలోనా అంటే నీవే నాకంటే ఎక్కువ చదివావు. అందంలోనా నేను నీకాలి గోటికి పోలను. దేశసేవలోనా నీవు స్త్రీవయివుండీ, ఆగర్భశ్రీమంతవయివుండీకూడా ప్రజలకోసం తిండీ, నిద్రాకూడా మాని కొండలూ, గుట్టలూ ఎక్కి, పల్లెపల్లెలూ తిరిగి జాతీయ ప్రబోధం చేస్తున్నావు. ఒక్కవయస్సులో తప్ప నీకంటే ఎందులోనయినా అధికుణ్ణి కాకపోతేమానె, నీతో సమానస్థితిలోకూడా లేని సందర్భంలో నిన్ను వివాహమాడడం నిన్ను ద్రోహం చెయ్యడం అవుతుంది. శాంతా! నీపాదాలమీద పడతాను. నన్ను క్షమించు. నన్ను దుర్మార్గుడను; క్రూరుడను; ద్రోహి అను. ఏమన్నా అను—నన్ను మాత్రం క్షమించానను."

శాంత మధూవుపన్యాసం శాంతంగా వింది. పెదవికొరుక్కుంది. కళ్లవెంట చిన్న ముత్యాలపేరు జారింది.

"మధూ! అయిందా నీవుపన్యాసం ?— విను, నిన్ను నేను క్షమించడం కాదు. నన్ను నీవు క్షమించాలి. నీవు నాకు తగనని చెప్పడంలోనే నీ వుత్తమలక్షణం కన్పిస్తోంది. నీకు ఆస్తిలేదనీ, నాకు ఆస్తివుందనీ, అందువల్ల నన్ను వివాహమాడననీ అన్నావు. నాకు డబ్బువుండడం మూలానే నీవు నన్ను విసర్జించ నిశ్చయించుకున్నట్లయితే నేను ముమ్మాటికీ దురదృష్టవంతురాలిని. సుఖం యివ్వని, కోరిన పురుషుని చేసుకోనివ్వకుండా అడ్డుపడే డబ్బు నాకెందుకు? దేశసేవలో నీకంటే నేను గొప్పదానినన్నావు. దేశంకోసం ఇల్లూ వాకిలీ, తల్లీ తండ్రీ విడిచి, వున్నపూట తిని లేనిపూట మాని కోసం అవస్థలపాలవలేదే! చక్కగా చీకూ చింతా లేక తలిదండ్రులచాటున చక్కటి భవనంలో నివసిస్తూ అప్పుడప్పుడు, సరదాకి తిరిగినట్లుగా, పల్లెలవెంట ప్రచారంకోసం బయలు దేరుతున్నాను. నీత్యాగం ముందు నేను చేసిన పనికూడా మహాత్యాగమనే చెప్పుకోవాలా? ఏం మాట్లాడవు? చదువన్నావు. నీకంటే ఏవిషయంలో నాఘనత? నీవు నాకంటే ఎక్కువ అనుభవం గడించావు. అనుభవంలోకంటే పుస్తకాల్లో ఎక్కువ నేర్చుకోగలవా? నేను పరభాషా వ్యామోహంతో కాలేజీలో చేరాను. నీవు నీచదువుకూడా దేశంకోసం మాని కష్టాలనుభవించి ప్రజాసేవకుడి వయ్యావు. అందమంటావూ? నీవు అందంగా లేవూ? నీ అందం నీకేం తెలుస్తుంది? నాకళ్లకు నీఅందంతో సమానమయిన అందం మరోచోట కనిపించలేదు. నీకోసం ఏంచెయ్యమంటే అది చేస్తాను...... నా తలిదండ్రులకు మగపిల్లలు లేరన్న సంగతి నీకు తెలిసిందే. వారు నిన్ను గౌరవించడంలో ఏమన్నా తక్కువచేస్తున్నారా? నిన్ను తమ కన్నకొడుకులా చూచుకుంటున్నారు. నీవు వచ్చిన దగ్గరనుంచీ వారి కొక బంగారపుకొండ దొరికినట్లుంది. వారి సంతోషానికి అంతరాయం కలిగించడం నీకిష్టమా? ఈఇల్లు నీదిగా భావించుకోవూ? నీవు మాతో వుండిపోతే నీవూ, నేనూ దేశంకోసం ఎంతో పనిచెయ్యగలం. మన జీవితాంతంవరకూ దేశంకోసం పాటుపడదాం—మధూ! ఊ అనవూ?" అతని రెండుచేతులూ తన చేతుల్లోకి తీసుకుని అతనివంక దీనంగా, ప్రేమతో చూచింది.

మధూ జవాబు చెప్పలేకపోయాడు. ఆనందంతో కళ్లవెంట నీరుబికి శాంతహస్తాలమీద పడింది. శాంత అతని చేతులు తన చెక్కిళ్లకు హత్తుకుంది.

శాంతతలిదండ్రులు మధూను అల్లుణ్ణిగా చేసుకునేందుకు కొంచెం శంకించారు. అతడు వుత్తముడని వారికి తెలుసు. కాని అతడు ఆంధ్రుడు. శాంతను అతనికిచ్చి వివాహంచేస్తే తమ బంధువు లేమంటారో?

శాంత మధూనితప్ప ఇంకొకళ్లని పెళ్లిచేసుకోనని మొండిపట్టుపట్టింది. వాళ్లకి ఆవివాహం యిష్టంలేకపోతే ఇల్లువిడిచిపెట్టి అయినాసరే అతన్నే వివాహమాడుతానుగాని మాననంది. ఒక్కతే పిల్ల. మధూకూడా శాంతకు తగిన యోగ్యుడు. శాంతతలిదండ్రులుకూడా అంత పూర్వాచారపరాయణులు కారు.

శాంతామధూల వివాహం వైభవంగా జరిగింది. పెళ్లికి శాంతబంధువులుగాని, మధూవైపువారెవరుగాని రాలేదు.

వివాహానంతరం కులాసాగా కాలంగడిపేందుకు బొంబాయి వెళ్లారు శాంతా, మధూ ఇద్దరూ.

అతిసరదాగా కొన్నినెలలు గడిచాయి.

## 3

౧౯౪౨ ఆగస్టు సమీపించింది. బొంబాయిలో అఖిలభారత కాంగ్రెసుసమావేశ మవడానికి కావలసిన ఏర్పాట్లు చేయబడుతున్నాయి. దేశనాయకులు ఒక్కొక్కరే బొంబాయి చేరుకుంటున్నారు.........

ఆగస్టు ౭, ౧౯౪౨. కాంగ్రెసుకార్యవర్గసభ సమావేశమయి బ్రిటిషు ప్రభుత్వం "ఇండియా వదలాలి" అనే తీర్మానాన్ని ఆమోదించింది.

ఆగస్టు ౮, ౧౯౪౨. అఖిలభారత కాంగ్రెసు సంఘసభ్యులు కార్యవర్గసభ ఆమోదించిన తీర్మానానికి

అంగీకారం తెలియజేశారు. మహాత్మణ్ణి ఉద్యమానికి నాయకుణ్ణి గావించుకున్నారు. మహాత్ముడు వైస్రాయితో సంప్రదించి ఉద్యమాన్ని లేవదీస్తానన్నాడు.

ఆరాత్రి అంతా పొద్దుపోయి ఇళ్లకు చేరారు. రాజకీయవాతావరణం బింకంగా వుంది. నాయకుల్ని అరెస్టుచేసి తీసుకుపోవచ్చునని వదంతులు బయలు దేరాయి. ప్రజలంతా సమరసన్నద్ధు లవుతున్నారు. మహాత్ముని కార్యక్రమ మెప్పుడూ అహింసాపద్ధతుల్లోనే నడుస్తుంది. ప్రజలు దానిని పూర్తిగా ఆమోదించి ఉద్యమాన్ని నడపడానికి సిద్ధులై వున్నారు.

ఆగస్టు ౯, ౧౯౪౨. తెల్లవారకముందే పిడుగులాటి వార్త బయలుదేరింది. నాయకులందర్నీ అరెస్టు చేశారు. కార్యవర్గసభ్యుల్ని ఎక్కడికి తీసుకెళ్లిపోయారో తెలియదు. మహాత్మణ్ణీ, ఇంకా కొందర్నీ పూనాఆగాఖాన్‌భవనానికి తీసుకెళ్లారు. ప్రజలు అదిరిపోయారు. వారి కేమీ తోచలా. ప్రభుత్వం తమకు నాయకుల్ని లేకుండాచేసి తమను అగాధంలో తోయడానికి సిద్ధమయిందని దద్దరిల్లిపోయారు. ప్రజలు శాంతియుతంగాకూడా సభలు జరిపేందుకు వీల్లేదని ప్రభుత్వం ఆంక్ష వేసింది. ప్రజలు నిర్లక్ష్యంచేసి సభలు జరిపితే లాఠీలు, బాష్పవాయువు ప్రయోగించబడ్డాయి. ప్రజలకు వెర్రెత్తిపోయింది. వారి కేం చేయాలో తోచలా. ఏది మంచో, ఏది చెడ్డో విచారించుకునే స్థితిలో లేరు వారు. టెలిగ్రాఫ్, టెలిఫోన్‌తీగలు తెంపారు. రైలుపట్టాలు లాగేశారు. పోస్టాఫీసులు ధ్వంసంచేశారు. ప్రభుత్వం ప్రజలమీద తుపాకులు కాల్చి వారిని మరీ రెచ్చగొట్టింది. అల్లర్లు బొంబాయి నుండి దేశంలో మూలమూలకీ పాకిపోయాయి.

శాంతామధూలు బొంబాయిలో జరిగిన అల్లర్లు కళ్లారా చూచారు. ప్రభుత్వం ప్రజల్ని రెచ్చగొట్టి, వారు వెర్రెత్తినతర్వాత వారిని అణచివేసేందుకు చేసిన కృత్యాలు వారిని కంపితులను చేశాయి.

పత్రికల్లో రోజూ వార్తలు వస్తున్నాయి. పోలీసులు నిరాయుధప్రజలమీద తుపాకులుపేల్చడం, ప్రజలు ఒళ్లుమరిచి పోలీసుల్ని బ్రతికివుండగానే కాల్చడం— అరాచకం ప్రబలిపోయింది. దేశంలో నలుప్రక్కలా రక్తప్రవాహాలు కట్టాయి. ఎంతమందో ప్రజలు మరణించారు. ఎంతమందో అధికారులు జీవాల్తో తగలపెట్టబడ్డారు. దేశమంతా హింసలో మునిగి తేలి ఆడింది. ప్రజలు ఒక నిర్ణీతపద్ధతిలో తమ ఉద్యమాన్ని నడపలేదు. ఉద్రేకంతో ప్రాణాలుమాత్రం అర్పించారు.

శాంతా, మధూ ఇద్దరూ తాము బొంబాయిలో సుఖాలనుభవిస్తూ వుండేందుకు సమయం కాదని పూనా వచ్చారు. రాగానే పల్లెల్లో సంచారం మొదలుపెట్టారు. వీరిని కొన్ని గ్రామాలకు వెళ్లకుండా పోలీసులు ఆటంకపరిచారు. వీరు వీలయినన్ని చోట్లకు వెళ్ళి హింసాకాండ మాన్పడానికి యత్నంచేశారు. వృథాగా రక్తం ధారపొయ్యొద్దని హెచ్చరించారు.

ఒక పల్లెలో పోలీసువారి దుండగాలు విపరీతమయి ప్రజలంతా తిరుగుబాటుచేసి పోలీసులు మకాం వేసిన ఇంటికి నిప్పంటించారు. వాళ్ల డేరాలు తగలపెట్టారు. ఇదంతా ఒకరాత్రికి రాత్రి చేశారు. ఈవార్త చెవినిపడగానే శాంతా మధూలు ఆ గ్రామం బయలుదేరారు. ప్రజల్ని శాంతులుకమ్మని బోధించారు. కాని వాళ్ళమాట ప్రజలు మన్నించేందుకు అవకాశమేదీ? ప్రభుత్వపు విమానాలు ఆగ్రామంమీద ఆకాశంనుంచి మరఫిరంగులు పేల్చాయి. మిలిటరీ చుట్టుముట్టి నిరాయుధప్రజల్ని ఎడాపెడా కాల్చింది. ప్రజలు తమకు చేతనయిన పని రాళ్ళూ, సోడాబుడ్లూ విసిరారు. మిలిటరీముందు యివి ఆగుతాయా? ఆపల్లె లోబడిపోయింది. ఊరిలో వున్న మగవాళ్ల నందర్నీ అరెస్టుచేసి తీసుకుపోయారు. మధూని కూడా తీసుకుపోయారు. ఇక ఇళ్లలో మిగిలింది స్త్రీలూ, బాగా దెబ్బలుతిన్న ముసళ్ళూ, పిల్లలూ.

ఆరాత్రి ఆగ్రామం అంతా ఒక స్మశానవాటికమాదిరి వుంది. ఏఇంట్లోనూ సరిగ్గా దీపంలేదు. కొన్ని ఇళ్లు మనుష్యులు లేక, దీపాలులేక దెయ్యాల కొంపల్లా వున్నాయి. ఏమూలచూచినా ఏడ్పులే. ఒక యువతి తన భర్తకోసం ఏడుస్తోంది. ఒక ముసలి తన కొడుకు మళ్లీ తిరిగి దక్కుతాడో లేదో అని ఎలుగెత్తి ఘోషపెట్తోంది. ఒక విధవాంగన తన కింకెవరు తిండి పెడ

తారు, తన అన్నను పొట్ట పెట్టుకున్నారని హోరున ఏడుస్తోంది. ఏమూలచూచినా ప్రళయరుద్ర తాండవమే.

శాంతకు నిద్రపట్టలా. ఒంటరిగా ఒక అరుగు మీద కూర్చుంది. ఆఇంట్లో ఎవరూ లేరు.

తన మధూని తీసుకుపోయారు! మధూ చేసిన అపరాధ మేమిటి? అత నెవర్ని చంపాడు? మధూ ఏ నేరమూ చేయకపోయినా ఇతర ప్రజలతోపాటు శిక్షననుభవించడానికి సిద్ధపడి నోరెత్తలేదు. మధూ దేశంకోసం ఎంతత్యాగం చేస్తున్నాడు! అలాటి మధూకి తను భార్యకావడం ఎంత అదృష్టం! తనకు ఏడ్పు తెప్పించుకోవాలన్నా రాదు. ఎందు కేడ్వాలి తను? మధూని చంపేస్తారా ప్రభుత్వంవారు? చంపనీ. అంతకంటే వాళేం చేయలేరుగదా? మధూ హృదయంలో వుద్భవించిన ఆ దివ్యశక్తిని వారు అంతరింపజేయగలరా? వారివశం కాదు. అతని దెంత కోమలశరీరం! ఎంత రాయిలాంటి పట్టుదల! ప్రభుత్వం తన భర్తను తన నుండి శారీరకంగా వేరుచేయవచ్చు కాని తమ బాంధవ్యాన్నీ, తమ ప్రేమనీ, తమ దేశభక్తినీ వారు తెంచగలరా? కల్ల! మిలిటరీవాళ్లు తీసుకెళ్లేముందు అతనన్న మాట లింకా ఆమెచెవుల్లో రింగెత్తుతున్నాయి: “శాంతా! అధైర్యపడక. నేను నీదగ్గర లేనని బెదిరి మతిచెడవద్దు. నే నెప్పుడూ నీహృదయంలోనే వుంటా. నేను భౌతికంగా నీకు దూరంగా వున్నా మనమిద్దరం ఒకేచోట వున్నట్లుగా భావించుకుని దెబ్బలు తిన్నవారికి వుపచర్యలు చెయ్యి. ఒకవేళ మన మీజన్మలో మళ్లీ కలుసుకోలేకపోయినా ఇంకొక జన్మయినా ఎత్తి, మనవంటివారి త్యాగంతో వచ్చిన స్వతంత్ర భారతంలో హాయిగా విహార్దాం. నీవు దేశసేవలో ఏమాత్రం వెనకంజవెయ్యక. నిన్నూ నన్నూ ఎవ్వరూ ఎడబాపలేరు. ఆమాట ముమ్మాటికీ నమ్ము, శాంతా! నవ్వు-ఏదీ? - ఆ-ఇప్పుడు రాణీఝాన్సీవి కా”— మిలిటరీవాళ్లతన్ని ఇక మాట్లాడనివ్వకుండా లాక్కుపోయారు. ఆదృశ్యం తలుచుకుంటే శాంతకళ్లల్లోకి నీరు వచ్చింది. ఎంత రాయిగుండె అయితేమాత్రం—ఏడ్పు ఆపుకోలేకపోయింది. గబగబా కళ్ల వెంబడి నీరు కాల్వలు కట్టింది. కాసేపు ఏడ్చి కళ్లు తుడుచుకుని ఏడ్చినందుకు సిగ్గుపడింది. ఏడ్చేందుకు సమయమా అది? తను అక్కడ ఒక్కతే కూర్చుని ఏంచెయ్యాలి? ఇళ్లల్లో ఏడ్పులు వినిపిస్తున్నాయి. ఓదారుద్దామని బయలుదేరింది. రోడ్డుపక్కన ఒక తుపాకీదెబ్బ తిని మరణించిన స్త్రీకళేబరం, ఆమెరొమ్ములను అంటిపెట్టుకుని పాలుత్రాగడానికి ప్రయత్నంచేస్తున్న ఒక పసిపాప కన్పించారు. ఆపిల్లను తీసుకుని భుజాన వేసుకుంది. పాపం! భుజాన వేసుకోగానే ఆపిల్ల నిద్రపోయింది.

అలా నడుస్తూవుండగానే ఆడవాళ్లు భయంతో వెర్రెత్తివేస్తున్న కేకలు, మగవాళ్ల రాక్షసనవ్వులు వినిపించాయి కొంచెందూరంలో. శబ్దంవినిపించిన వైపు పరుగెత్తింది. మిలిటరీవాళ్లు ఇళ్లల్లో దూరి స్త్రీలను బలవంతపరుస్తున్నారు. శాంత ఒక ఇంట్లో తొంగిచూచింది. దీపం సరిగ్గా లేక ముందు ఏమి జరుగుతున్నదీ స్ఫుటంగా గోచరించలా. కాని మెల్లగా ఆ ఘోరదృశ్యం తనకళ్లకు స్ఫుటంగా కనిపించింది. ముగ్గురు మిలిటరీవాళ్లు ఒకస్త్రీని...

ఆదృశ్యం శాంత చూడలేకపోయింది. ఆ గుమ్మంలో కత్తిబిగించిన తుపాకీ ఒకటి కన్పించింది. మిలిటరీవా డెవడో లోపలికెళ్లినప్పుడు దాన్నక్కడ విడిచిపెట్టినట్టున్నాడు. భుజంమీద పిల్లణ్ణి జారవిడిచింది. కెవ్వుమని కేకవేసి ఏడ్వడం మొదలెట్టాడు పిల్లడు. పిల్లడి అరుపు విని మిలిటరీవాళ్లు లేచారు. కాని ఈలోగానే తుపాకీ చేతపుచ్చుకుని భయంకర కాళిలాగా వారిమీదికి లంఘించింది శాంత. ముగ్గుర్నీ విపరీతంగా పొడిచింది. మానాపహరణ అయిన స్త్రీ ఆరాక్షసులబారినుండి తప్పింపబడగానే ఒక మూలకు పరుగెత్తిపోయి ఏదో చిన్నగుడ్డ చుట్టుకుంది. శాంత వీథిలోకి పరుగెత్తింది వాళ్లు చచ్చారుగదా అని. కాని అందులో ఒకడు చావలా. వాడికి దెబ్బ బాగానే తగిలింది కాని శాంత బయటికి పరుగెత్తడం చూచి లేవలేక లేవలేక లేచి, వెనక పరుగెత్తడానికి ప్రయత్నం చేసి, రెండడుగులు వేసి, ఇక నడవలేక కింద కూలిపోతూ ఈలవేశాడు. శాంత వెనక్కు తిరిగి మళ్లీ ఓపోటు పొడిచి వీథినపడింది. ఈల విని కొందరు మిలిటరీవాళ్లు పక్కయిళ్లల్లోంచి ఆయుధాల్తో పరుగెత్తుకొచ్చారు.

ఆమెను చుట్టుముట్టేశారు. పదిమంది సాయుధులైన మగవాళ్లలో తనొక్కతే ఏం చేస్తుంది? లొంబడిపోయింది. కాని లొంబడేముందు అందులో నలుగుర్ని పొట్టచెట్టుకుంది. లొంబడిపోగానే క్రోధంకొద్దీ ఆమెను బలవంతపరిచారు. ఆమెవంటిమీద గుడ్డలేకుండా లాగేశారు. ఆమెను నేలను పడేశారు. ఆమెను...

ఆమెకు వంటిమీద తెలివి వచ్చేటప్పటికి తెల్లవారి సమీపిస్తోంది. తెలివివొచ్చేటప్పటికి వంటిమీద ఒక గుడ్డయినా లేదు. తనను చూచి తనకే అసహ్యం కలిగింది. ఆశరీరంమీద తనకు రోత, ద్వేషం కలిగాయి. గబగబా పక్కనే ఒకకొంపలోకి పరిగెత్తింది. అందులో ఎవ్వరూ లేరు. ఆమూలా ఈమూలా వెదికి ఒక పాతచీర తీసుకుని కట్టుకుంది. తనను బలాత్కరించినవారిమీద ఒక్కసారి ప్రళయకోపం వచ్చింది. కాని అంతకంటే తన శరీరంమీద అసహ్యభావం వెంటనే మరింత ఎక్కువగా కలిగింది. మధూ జయం పొంది తిరిగివస్తే ఈశరీరాన్నా అతనికి వప్పజెప్పడం? ఝాన్సీరాణీవి కమ్మన్నాడే! రాణీ! ఛీ—అతడు పవిత్రుడు—తను కళంకిత. ఆవిషయాన్ని తలుచుకున్న కొద్దీ విషపుభావాలు కలిగినాయి ఆమెమనస్సులో. జీవితంమీద ఇచ్ఛ నశించిపోయింది. శరీరం కుళ్లిపోయినట్లుగా కన్పించింది. ఓమూల ఓ పాతగుడ్డ కన్పించింది. దాన్ని తీసుకుని ఆలోచిస్తూనే వుచ్చు వేసింది. ఇంటి నడిమిదూలం అంత ఎత్తుగా లేదు. చూచింది. కాళ్లకింద ఓమూలవున్న కొయ్యపెట్టె ఒకటితీసి ఎత్తుపెట్టుకుని నడిమిదూలానికి పాతగుడ్డ బిగించి వుచ్చులో తల దూర్చింది. మధూవిగ్రహం కళ్లకుకట్టినట్టు కనిపించింది. తల తీసివెయ్యబోయింది వుచ్చులోంచి. తను చచ్చిపోవాల్సిందే? తప్పు తను కావాలని చేసిందా? మధూ తనకు జరిగిన అవమానంసంగతి వింటే ఏం చేస్తాడు? తన దురదృష్టానికి చింతిస్తాడు. గతించినదానికి ఎందుకు ఏడవడ మంటాడు. అతడు ఉదారబుద్ధి కలవాడు. దేశభక్తుడు. తన ధైర్యానికి మెచ్చుకుంటాడు. తనను దగ్గరకుతీసి బుజ్జగిస్తాడు. దేశంకోసం అగచాట్లు పడినందుకు. కాని—ఛీ-ఆలాటి పవిత్రుడి చేతుల్లో నా తన మలినదేహాన్ని పెట్టడం?-మళ్లీ వుచ్చులో తల దూర్చింది. అతని కొక వుత్తరమన్నా రాయకద్దా? ఏమిటి రాయడం? పోనీ, తనెందుకు చచ్చిపోయిందో అతని కెందుకు తెలియాలి? తెలిసి లాభమేమిటి?— ఆమెబుర్ర ఈఆలోచనలో పడి నలిగిపోయింది. వెయ్యిసుత్తులు పెట్టి కొట్టినట్లయింది. బాధ కోర్వలేక కాళ్లు పెట్టెమీదనుంచి పక్కకి జారవిడిచింది—“ఆ-ఊ-ఆ-ఆ – –”

శాంత మరణించినవార్త వూరంతా వ్యాపించింది. ఈ ఆత్మహత్యసంగతి దేశం దేశమంతా మూడు రోజుల్లో తెలిసిపోయింది. పత్రికల్లో ఆమెఫొటోలు ప్రకటించారు. ఆమెనుగురించి పొగడ్తలు వ్రాశారు.

మధూకికూడా శాంతమరణవార్త చెవినిపడింది. ఎందుకు చచ్చిందో తెలియకుండా వుంటుందా? అతని రక్తం వుడికిపోయింది. శాంత! తన శాంత చచ్చిపోయిందీ! నిజంగానే? ఇక తనకు శాంత కనపడదూ? చిన్నపిల్లడిలాగా ఏడ్చాడు. పెళ్లయి సంవత్సరం కాలేదే? అప్పుడే శాంత తననుండి దూరమయిపోయిందా? “శాంత, శాంత” అని అతని మనసు కలవరించింది. ఏమూల చూచినా శాంతే కనిపించింది అతనికి.

ఆరోజు మధ్యాన్నం అన్నం తెచ్చినవాణ్ణి తనకు తెలియకుండానే పళ్లెమెత్తి నెత్తిన కొట్టాడు. బందిఖానాచట్టాలు జవదాటినందు కతన్ని ఆ రోజు కొరడాదెబ్బలు కొట్టారు.

రోజురోజుకీ శాంతను తలచుకుని అతను కృశించిపోవడం మొదలుపెట్టాడు. జైలులో బండపనులు చేయడంలో పూర్తిగా వెనకబడిపోయాడు. రానురాను కొరడాదెబ్బలు తినని రోజు లేదు. రోజులు, నెలలు, సంవత్సరాలు గడిచిపోయాయి. ఇప్పుడు మధూ వెనకటి మధూ కాదు. ఈ నాలుగుసంవత్సరాల్లో అతనికి ముసలితనం వచ్చింది. అతని కిప్పుడు వుబ్బసం. ఒళ్లంతా చేపపొలుసుల్లా పొరలు తేలిపోయింది. మొహం గుంటలడిపోయింది. ఇంకెన్నాళ్లో బ్రతకడతను కూడా. కాని యీప్రపంచాన్ని వీడేముందు మనమంతా ఏకమై స్వతంత్రం సంపాదించామన్న సంతోషవార్త అతనిచెవిని పడేస్తామా? లేక........